క్లుప్తంగా

తైక్వాండోలో కాంస్యం



కాంస్య పతకాన్ని అందుకుంటున్న బాలవర్ధన్‌రెడ్డి

పరిగి: మండల పరిధిలోని రంగంపల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల బాలవర్ధన్‌రెడ్డి సీనియర్ జాతీయ తైక్వాండో పోటీల్లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 10 నుంచి 12 వరకు జరిగిన జాతీయ తైక్వాండో పోటీల్లో పాల్గొని, సీనియర్ కేటగిరి 74 కేజీల విభాగంలో కాంస్యం గెలుచుకున్నాడు. అంతర్జాతీయ తైక్వాండో అబ్జర్వర్ మాస్టర్ కైలాష్‌కర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. జాతీయ స్థాయిలో రాణించిన బాలవర్ధన్‌రెడ్డిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి ఉత్సవాలు



ఎల్లమ్మతల్లి సన్నిధిలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పూడూరు: మండల పరిధిలోని మిట్టకంకల్ గ్రామంలో ఎల్లమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు రాంచందర్ యాదవ్, ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. గ్రామం ప్రధాన వీధుల గుండా ఆలయం వరకు బోనాలతో ఊరేగింపుగా వచ్చిన భక్తులు.. అమ్మ వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కడుమూరు ఆనందం, సర్పంచ్ శ్యాంకుమార్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

‘చెత్త’శుద్ధి ఏదీ?



ఎక్మాయిలో ఇళ్ల మధ్య పారుతున్న మురుగు నీరు

బషీరాబాద్: పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. రోడ్లు, వీధుల్లో చెత్తాచెదారం పేరుకు పోయి, వ్యర్థ జలాలు పారుతుండడంతో గ్రామీణ ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. ఎక్మాయి, కంసాన్‌పల్లి, జలాల్‌పూర్, క్యాద్గీరా, రెడ్డిఘనాపూర్, నవల్గా, నంద్యానాయక్ తండా, వాల్యానాయక్‌తండా గ్రామాల్లో సరిపడా మురుగు కాల్వలు లేక ఇళ్లల్లో నుంచి వచ్చే వ్యర్థ జలాలు.. ఇళ్ల మధ్య వీధుల్లో పారుతోంది. ఎక్మాయిలో చాలా రోజులుగా పారిశుద్ధ్య సిబ్బంది చెత్త తీయకపోవడంతో రోడ్డుపై పేరుకుపోయింది. దీంతో దోమలు పెరిగి, తాము రోగాల బారిన పడే ప్రమాదం ఉందని బాధిత గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్త చేస్తున్నారు.

గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సామ్యారెడ్డి

కుల్కచర్ల: కుల్కచర్ల మండల కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ సామ్యారెడ్డి అన్నారు. ఆదివారం కళ్యాణ్‌నగర్‌లో ఉపాధిహామీ నిధులు రూ.4లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు, ఎస్సీ కాలనీలో రూ.4 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించి ఆమె మాట్లాడారు. కుల్కచర్ల గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నేతలు రాములు, యాదయ్య, చుక్కయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

తాండూరు రూరల్: తాండూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ సమావేశ మందిరంలో సమావేశం ఉంటుందని తెలిపారు. కావున ఎంపీటీసీ, సర్పంచులతో పాటు వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

అసంపూర్తిగా ఆదర్శ వసతిగృహం

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోంది. అందులో భాగంగా తెలంగాణలో అనేక గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, వసతి గృహాలు అందుబాటులోకి తెచ్చి, అన్ని వర్గాల విద్యార్థుల ప్రగతికి బాటలు వేస్తోంది. కానీ.. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ, విద్యాశాఖ అధికారుల సమన్వయలోపం కారణంగా అక్కడక్కడా విద్యాకుసుమాలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

- నిరుపయోగంగా మారిన భవనం
- అసౌకర్యంతో విద్యార్థుల అవస్థలు
- దశాబ్ద కాలంగా కొనసాగుతున్న మొదటి అంతస్తు నిర్మాణ పనులు
- పట్టించుకోని టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ అధికారులు



ప్రారంభానికి నోచుకోని మోడల్ స్కూల్ హాస్టల్ భవనం

బంట్వారం: మోడల్ స్కూల్ హాస్టల్ భవనం గ్రౌండ్ ఫ్లోర్ పూర్తియినప్పటికీ.. ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో విద్యార్థులకు ఉపయోగం లేకుండా పోయింది. ఎప్పటి లాగే బాలికలు ఇంటి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గుత్తేదారుకు పే అండ్ అకౌంట్స్ నుంచి సకాలంలో బిల్లులు అందకపోవడంతో ఏళ్ల తరబడి నిర్మాణం పూర్తి కాకపోవడం గమనార్హం.

పది సంవత్సరాలుగా..

బంట్వారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్ భవనం నిర్మాణానికి పదేళ్ల కిందట రూ.1.28 కోట్లు మంజూరయ్యాయి. 2012 సంవత్సరంలో టెండర్‌లో పనులు దక్కించుకున్న గుత్తేదారు.. పునాది దశలోనే వదిలేసి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో సంబంధిత టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ అధికారులు అప్పట్లో రీటెండర్ వేయడంతో మరో కాంట్రాక్టర్ ముందుకు వచ్చారు. కానీ బిల్లులు అందకపోవడంతో సదరు గుత్తేదారు ఏళ్ల తరబడి పనులు పూర్తి చేయలేకపోయారు. పదేళ్ల కిందట మంజూరైన భవనం.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ పూర్తికాకపోవడం విచారకరం. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్ పనులు పూర్తి కాగా.. మొదటి అంతస్తు స్లాబ్ దశలోనే ఆగిపోయింది.

విద్యార్థులకు అసౌకర్యంగా..

బంట్వారంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో సుమారు 700 మంది విద్యార్థులు ఇంటర్ వరకు చదువుతున్నారు. హాస్టల్ భవనం పూర్తి కాకపోవడంతో వారు అసౌకర్యానికి గురవుతున్నారు. వసతిగృహం ముఖ్యంగా బాలికల కోసమే మంజూరు చేశారు. హాస్టల్‌లో 9వ, తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 100 మంది బాలికలు ఉండేలా సదుపాయం కల్పించారు.

పట్టించుకోని అధికారులు

టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ పరిధిలోని ఈ నిర్మాణ పనులను ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. హాస్టల్ భవనం నిర్మాణ సమయంలో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేనే లేదు. పనుల నాణ్యతను పరిశీలించే వారే ఆ శాఖలో కనిపించడం లేదు. గుత్తేదారుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా



మోడల్ స్కూల్ హాస్టల్ భవనం నిర్మాణం పదేళ్లుగా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ ఇద్దరు గుత్తేదార్లు మారినట్లు తెలుస్తోంది. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా. వసతిగృహం లేకపోవడంతో బాలికలు అసౌకర్యానికి గురవుతున్నారు. సరైన రవాణా సౌకర్యం లేక.. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– చంద్రప్ప, ఎంఈఓ

రీ టెండర్ వేస్తాం..

హాస్టల్ భవనం జీప్లస్–1 నిర్మించాల్సి ఉన్నప్పటికీ.. గుత్తేదారు పనులు నిలిపి వేశారు. మళ్లీ రీ టెండర్ వేస్తాం. ఆగిపోయిన పనులు పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు పని చేసిన గుత్తేదారుకు పే అండ్ అకౌంట్స్ నుంచి బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిన మాట వాస్తవమే. త్వరలోనే రీ టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, భవనం వినియోగంలోకి తెస్తాం.

– నరోత్తం ఏఈ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ

బండి సంజయ్‌ను అరెస్టు చేయాలి



కొడంగల్: ఠాణాలో మాట్లాడుతున్న కౌన్సిలర్ మధుయాదవ్ తదితరులు

కొడంగల్: బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్‌ను అరెస్టు చేయాలని కౌన్సిలర్ మధుయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను దూషించిన బండిని అరెస్టు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. లిక్కర్ కేసులో కవిత పేరును కావాలనే చేర్చి, కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచులు అంజద్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘బండి’ దిష్టిబొమ్మ దహనం

బొంరాస్‌పేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ బీఆర్‌ఎస్ పార్టీపై చేస్తున్న విమర్శలకు నిరసనగా బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పార్టీని కించపరిచే విధంగా బీజేపీ నేతలు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ప్రజా సంక్షేమాన్ని మరచి, రాజకీయంగా ఎదుర్కోలేక తమ నేతలపై ఇష్టానుసారంగా నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: దుద్యాలలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మున్నూరు కాపులు ఏకం కావాలి

కొడంగల్: జిల్లాలోని మున్నూరుకాపులు హక్కుల సాధనకై ఏకం కావాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకరప్ప, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి శోభమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు ఆదివారం మాట్లాడుతూ మున్నూరు కాపులు ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా.. స్వతంత్రంగా బతుకుతున్నారని, మన హక్కులను ప్రభుత్వంతో పోరాడి సాధించుకోవాలని తెలిపారు. కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లో పర్యటించి సంఘాల ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. మున్నూరుకాపులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అరిగె ఓంప్రకాశ్, చంద్రశేఖర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం

- పట్టుదలతో చదివి.. ఉన్నస్థాయికి ఎదగాలి
- డాక్టర్ రవీంద్రయాదవ్



విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

కొడంగల్ రూరల్: క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యం దిశగా సాగుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో తల్లిదండ్రులకు పాదపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీర్వాదం ఎంతో గొప్పదని, విద్యార్థి దశ కీలకమైందని చెప్పారు. పట్టుదలతో చదువుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకునేలా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్‌బాబు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మన ఆలోచనే విజయానికి నాంది

- మహిళలు స్వయం కృషితో ఎదగాలి
- మహిళా దినోత్సవంలో వక్తలు



వికారాబాద్ అర్బన్: కేక్ కట్‌చేస్తున్న చైర్‌పర్సన్, వార్డు మహిళలు



దోమ: బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ అనిత గౌడ్

వికారాబాద్ అర్బన్: మహిళలు స్వయం కృషితో ఎదిగేందుకు కృషి చేయాలని, ఒకటి రెండు సార్లు ఆటంకాలు ఎదురైనా మనోధైర్యంతో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల సూచించారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మనం ప్రారంభించే ప్రతి పనిలో విజయం సాధిస్తామనే నమ్మకంతో ముందుకు వెళ్లాలని, సానుకూలమైన ఆలోచనే విజయాన్ని తెచ్చి పెడుతుందని చెప్పారు. అనంతరం కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.

అన్ని రంగాల్లో రాణించాలి

దోమ: మహిళా సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ అనిత గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు వెళ్లాలని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా సంఘాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని, ప్రభుత్వం నుంచి అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తూ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా.. మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనం లేదని సంఘాల సభ్యులు వారి దృష్టికి తీసుకురాగా.. భవనం నిర్మించేందుకు చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

రుద్రభూమిలో కొలువైన శివుడు



విగ్రహం వద్ద వీరశైవ సమాజ సభ్యులు

తాండూరు టౌన్: పట్టణంలోని రుద్రభూమిలో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం పరమ శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సమాజం అధ్యక్ష, కార్యదర్శులు పటేల్ శ్రీశైలం, గాజుల శాంత్‌కుమార్‌తో పాటు సభ్యుల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ పండితుడు మహంతయ్య స్వామి వేద మంత్రోచ్చారణల మధ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించగా.. సమాజ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమాజ అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ సభ్యుల సహకారంతో నిలువెత్తు శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, భవిష్యత్‌లో రుద్రభూమిలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమాజ సభ్యులు, వీరశైవ యువదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు పోరాటం



గుడిసె వాసులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు భూ పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రామస్వామి అన్నారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 75లోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో 27 రోజులుగా పేదలు గుడిసెలు వేసుకొని తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సీపీఐ నాయకులు గుడిసె వాసుల వద్దకు వెళ్లి భరోసా కల్పించారు. అనంతరం రామస్వామి మాట్లాడుతూ.. పేదలు గుడిసెలు వేసుకొని 27రోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూమ్‌లు కట్టించి ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన ఈ ప్రభుత్వం.. ఎనిమిదేళ్లు అవుతున్నా ఎక్కడా ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అందుకే ఇళ్లు లేని పేదలు సంఘటితమై ప్రభుత్వ భూమిలో వారే గుడిసెలు వేసుకున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి వచ్చి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, గుడిసె వాసులు ఉన్నారు.

అంబేడ్కర్, పూలే ఆశయ సాధనకు కృషి



వెంకటేశ్‌కు అవార్డు అందజేస్తున్న రామకృష్ణ, మల్లేశ్ తదితరులు

షాబాద్: అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. ఆదివారం తిరుపతిలో జరిగిన బహుజన రైటర్స్ సౌత్ ఇండియా ఆరో కాన్ఫరెన్స్‌లో షాబాద్ మండలం నాగర్‌కుంట గ్రామానికి చెందిన మల్లి వెంకటేశ్‌కు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర కో–ఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు మళ్ళగల మల్లేశ్‌లు మల్లి వెంకటేశ్‌కు అంబేడ్కర్ జాతీయ నేషనల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా బహుజన సాహిత్య అకాడమీ ముందుకు సాగుతోందన్నారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతుగా విద్యా, సామాజిక దురాచారాల నిర్మూలన తదితరాల కోసం కృషి చేయాలని కోరారు.

కుక్కల దాడిలో దూడల మృతి

కేశంపేట: కుక్కలు దాడి చేయడంతో రెండు లేగదూడలు మృతి చెందిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంజాయి కృష్ణ వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపైన ఆధారపడి జీవిస్తున్నాడు. రోజు మాదిరిగా ఆవులు, లేగదూడలను పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా కుక్కల దాడిలో రెండు లేగదూడలు మృతి చెందడంతో పాటు ఆవులను కరిచి గాయపరిచినట్లు తెలిపారు.

చిలుకూరులో ఘనంగా మల్లన్న బోనాలు



బోనాల ఊరేగింపు ప్రారంభిస్తున్న నేతలు

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరులో బీరప్పస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మల్లన్న బోనాల ఊరేగింపు పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య వైభవంగా కొనసాగింది. మహిళలంతా బోనాలతో వెళ్లి మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శివసత్తులు అగ్నిగుండాలు తొక్కే కార్యక్రమం, ఉక్కుగొలుసు తెంపే కార్యక్రమం భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగెరి మల్లేశ్ ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఆంద్రూ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, నాయకులు జయవంత్, కురుమ సంఘం నాయకులు బీరయ్య, నరేందర్, రమేష్, రాజు, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



బోనాలు తీసుకువస్తున్న మహిళలు

శంకర్‌పల్లి: మండలంలోని మిర్జాగూడ గ్రామంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రతి ఇంటి నుంచి బోనం నైవేద్యాలను సమర్పించారు. బోనాలను గ్రామంలోని వీధుల గుండా ఊరేగిస్తూ తీసుకు వచ్చారు. దీంతో శివసత్తుల ఆటలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామం సర్పంచ్ రవీందర్‌గౌడ్, ఉప సర్పంచ్ శాంతికిషన్ సింగ్, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్ వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల కోసమే కిసాన్ సంఘ్ పోరాటం



జెండా ఎగురవేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

షాబాద్: భారతీయ కిసాన్ సంఘ్ రైతుల కోసం పోరాటం చేస్తుందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎల్గోండగూడ గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 4వ తేదీ నుంచి 10 రోజుల పాటు గ్రామాల్లో జెండా ఆవిష్కరణ, గోవుల పూజ, అభ్యుదయ రైతులను గుర్తించి, భగవాన్ బలరాముడికి పూజ చేస్తామన్నారు. రైతులందరూ పార్టీలకు అతీతంగా సంఘటితం కావాలని సూచించారు. విశేష సేవలు అందించిన అధికారులను గుర్తిస్తామన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలు వస్తే 18004253600కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు పెంటయ్య, వీరేశం, రైతులు నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటయ్య, నర్సింహులు, బీరయ్య, బాలయ్య, చిన్న నర్సింహారెడ్డి, మల్లేష్, శేఖర్, కిష్టయ్య, రుక్మద్దీన్, గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎనలేనిది

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్వర్తి గ్రామంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో హెచ్‌ఎండీఏ నిధులు రూ.10లక్షలతో సీసీరోడ్డు పనులను సర్పంచ్ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ సమస్యలు లేకుండా చేస్తున్నామని వెల్లడించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విక్రంరెడ్డి, చెన్నారెడ్డి, నాగరాజు, ప్రవీణ్, కాంతిరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం క్రీడా మైదానం



నాపరాతి ముక్కలతో క్రీడా ప్రాంగణం

ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏ ప్రదేశం అనుకుంటున్నారా? అదేనండీ.. ఊరుకో క్రీడా ప్రాంగణం పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు మైదానమే! ఇది. పేరుకే ప్రతిష్టాత్మకం కానీ.. అది పూర్తిగా వికృతమే! ఏదో ఏర్పాటు చేశామంటే చేశారు. కానీ.. అక్కడ ఎటువంటి ఏర్పాట్లూ చేయలేదు. ఊరికి కిలో మీటరు దూరాన ఉన్న ఈ మైదానంలో మొత్తం నాపరాతి ముక్కలు, చుట్టూ చెత్తాచెదారంతో డంప్ యార్డును తలపిస్తుండడంతో.. అది ఓ బంజరు దొడ్డిలా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఆటలకు అనువుగా లేని స్థలం.. ఉండెందుకూ.. లేకెందుకంటూ ప్రశ్నిస్తున్నారు.

– తాండూరు రూరల్